తూటంగిలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ కేంద్రంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న సుమారు 200 మంది వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య నిపుణులు విజయ్ కుమార్, స్థానిక వైద్యులు రాంబాబు, అంబిక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ సౌరి, ఎంఎల్ హెచ్‌పి, హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

ఉమ్మడి విశాఖ నుంచి ఆరు అసెంబ్లీ స్థానాలకు పేర్లు ప్రకటన

బుల్లిబాబు, పాడేరు
శ్రీనివాసరావు,మాడుగుల
రామగంగాధర్, అనకాపల్లి
తాతారావు, పాయకరావుపేట
భగత్, పెందుర్తి
శ్రీనివాసరావు,విశాఖ తూర్పు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

లోక్‌సభ, శాసనసభకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. మంగళవారం విడుదల చేసిన ఆ జాబితాలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఆరుగురికి చోటు దక్కింది. వీటిలో భాగంగా విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి జి.శ్రీనివాసరావు, మాడుగుల నుంచి బిబిఎస్.శ్రీనివాసరావు, అనకాపల్లి నుంచి ఐ.రామగంగాధరరావు, పెందుర్తి నుంచి పి.భగత్, పాయకరావు పేట నుంచి బోని తాతారావు, పాడేరు (ఎస్‌టి) నుంచి శతక బుల్లిబాబు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేయనున్నట్లు అధిష్టానం పేర్కొంది.

పాడేరు అసెంబ్లీ అభ్యర్థిగా బుల్లిబాబు

ట్రైకార్ మాజీ చైర్మన్ సతక బుల్లిబాబును కాంగ్రెస్ పార్టీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థిగా అధిష్టానం ఖరారు చేసింది. ఆయన ప్రత్యర్థ వైసిపి, టిడిపి అభ్యర్థులకు ధీటుగా నిలవనున్నారని పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. తొలుత కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన బుల్లిబాబు తర్వాత వైసిపి ఆవిర్భావం నుంచి సేవలు అందిస్తూ వచ్చారు. పార్టీ పాడేరు మండల అధ్యక్షులుగానూ, అరకు పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ సెక్రెటరీగానూ పార్టీ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ శ్రేణులను నడిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఎపి ట్రైకార్ చైర్మన్‌గా వైసిపి ప్రభుత్వం నియమించింది. తరువాత కాలంలో రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా ట్రైకార్ చైర్మన్ పదవిని పొడిగించలేదు. ఈ విషయంలో బుల్లిబాబు అసంతృప్తికి గురయ్యారు. ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన ఇవ్వకపోయినా పార్టీకి సేవలందించిన వ్యక్తిగా కనీస గౌరవం ఇవ్వలేదన్న బాధ ఆయనను కలిచి వేసింది. ఆ తరువాత పార్టీకి దూరం జరిగారు. ఇటీవల చింతపల్లిలో షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ క్రమంలోనే ఆయనకు టికెట్ దక్కింది.

వీరిలో విశాఖ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న గుత్తుల శ్రీనివాసరావు నగరంలోని సీతమ్మధార బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన బికాంతో పాటు ఎల్ఎల్‌బి పూర్తి చేశారు. 1997 నుంచి 2000 వరకు విశాఖపట్నం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గానూ, 2000-01లో స్టేట్ జనరల్ సెక్రటరీగానూ, 2006లో ప్రెసిడెంట్‌గానూ పనిచేశారు. 2009లో కాంగ్రెస్ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. 2011 నుంచి పిసిసి కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

అనకాపల్లి స్థానానికి పోటీ చేస్తున్న ఇల్లా రామ గంగాధర్ పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందినవారు అంచెలంచెలుగా ఎదిగారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవలు అందించారు. అనంతరం రాజకీయాల్లో ప్రవేశించి 2009, 2014 ఎన్నికలలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ వెంట ఉన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్ నుంచి ఎంతో మంది వెళ్లిపోయినా పార్టీనే నమ్ముకుని పనిచేశారు. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఆయన పోటీ చేశారు. ప్రస్తుతం పార్టీ అనకాపల్లి అసెంబ్లీ ఇన్‌ఛార్జిగానూ, పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధిగానూ పనిచేస్తున్నారు.

మాడుగుల నియోజకవర్గం నుంచి బొడ్డు శ్రీనివాసరావు బరిలో ఉన్నారు. కాలేజీ రోజుల్లో ఎన్ఎస్‌యుఐలో అధ్యక్షునిగా పనిచేశారు. ఆయన తండ్రి బొడ్డు మోదు నాయుడు కాంగ్రెస్‌లో సేవలు అందించారు. చీడికాడ పిఎసిఎస్ అధ్యక్షులుగా, అనంతరం మండల పార్టీ అధ్యక్షులుగా పనిచేసి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేశారు. తండ్రి బాటలోనే శ్రీనివాసరావు నడుస్తున్నారు. 2018లో మాడుగుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. 2019లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం ఉమ్మడి విశాఖ జిల్లా పార్టీ ఇన్‌ఛార్జిగానూ పనిచేశారు. పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పార్టీ బలోపేతానికి కృషి చేశారు.

పెందుర్తి అభ్యర్థిగా పిరిడి భగత్ పోటీ చేస్తున్నారు. ఆయన 93వ వార్డు పరిధి బాలాజీ గార్డెన్‌లో నివాసం ఉంటున్నారు. ఎల్ఎల్‌బి విద్య అభ్యసించారు. జెఎన్‌టియులో ఎంబిఎ చేశారు. 2007 నుంచి ఎన్ఎస్‌యుఐలో పలు హోదాల్లో పనిచేశారు. 2017-19 మధ్య రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరుపున పోటీ చేశారు.

పాయకరావు పేట నుంచి పోటీ చేస్తున్న డాక్టర్ బోని తాతారావు వైద్య విద్య అభ్యసించారు. ప్రొఫెసర్‌గా సేవలందించారు. విశాఖ జిల్లా భీమునిపట్నం మండలానికి చెందిన ఆయన విశాఖ నగరంలోని పెదవాల్తేరులో నివాసం ఉంటున్నారు.

నిరసన కార్యక్రమం చేస్తున్న వంతల రాజేశ్వరి అనుచరులు

రాజేశ్వరికి టికెట్ ఇవ్వకుంటే రాజీనామాలకు సిద్ధం

ప్రజాశక్తి -రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గం టిడిపి టికెట్ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరికి ఇవ్వకుంటే రాజీనామాలకు సిద్ధమని ఆమె అనుచరులు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం రంపచోడవరంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో పూర్తిగా నిర్వీర్యమైన తెలుగుదేశం పార్టీకి వంతల రాజేశ్వరి నాయకత్వంలో పూర్వ వైభవం వచ్చిందని, 11 మండలాల్లో మంచి మెజారిటీతో గెలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఇటువంటి తరుణంలో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి చేసిన వారికి కాకుండా, ప్రజలకు కార్యకర్తలకు, నాయకులకు ఏమాత్రం పరిచయం లేని, పార్టీకి ఒక్కరోజు కూడా పనిచేయని వ్యక్తికి టికెట్ ఇవ్వడం దారుణమన్నారు. పార్టీ ప్రకటించిన మిరియాల శిరీష దేవి ఇప్పటివరకు 11 మండలాల్లోని ముఖ్య నాయకులను కలుపుకొని వెళ్లడం లేదని, ప్రస్తుత ఇన్చార్జి వంతల రాజేశ్వరిని కూడా మర్యాదపూర్వకంగా కలిసిన దాఖలా లేవని పేర్కొన్నారు. టిడిపి అధినేత అధ్యక్షులు చంద్రబాబుపై నమ్మకంతో ఇప్పటి వరకు వేచి చూస్తున్నామన్నారు. కార్యకర్తల, నాయకుల అభిప్రాయాలపై పార్టీ అధిష్టానం స్పందించకపోతే పార్టీ పదవులకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తామని స్పష్టం చేశారు.

సెక్టార్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి

కలెక్టర్ ఎం.విజయ సునీత

ప్రజాశక్తి పాడేరు : సార్వత్రిక ఎన్నికలను విజయ వంతం చేసే బాధ్యత సెక్టార్ అధికారులపైనే ఉందని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత స్పష్టం చేసారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అరకు నియోజక వర్గం సెక్టార్ అధికారులకు నియోజవర్గం స్థాయి మాస్టర్ ట్రైనీలకు పోలింగ్ ప్రక్రియ, ఈవిఎంల ఏర్పాటు, సెక్టార్ అధికారుల బాధ్యతలు, విధులపై మంగళవారం మూడవ విడత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగుకు ముందు, తరువాత నిర్వహించ వలసిన ప్రక్రియలో సెక్టార్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పోలింగ్ రోజున ఈవి ఎంల నిర్వహణ, అనంతరం స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలింపుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియలో బాధ్యతా రాహిత్యం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి లోటు పాట్లుంటే జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించాలని చెప్పారు. పోలింగ్ నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈవిఎంలు సక్రమంగా పోలింగ్ అధికారులకు అందిందీ లేనిదీ క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. కంట్రోల్ యూనిట్, వివి పాట్, బ్యాలెట్ యూనిట్లను సంబంధిత పోలింగ్ కేంద్రానికి మ్యాపింగ్ చేసిన యంత్రాలు వచ్చిందీ లేనిది సరిచూసుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్లకు ముందుగానే సమాచారం అందించాలని చెప్పారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని పేర్కొన్నారు. ప్రతీ రెండు గంటలకు పోలింగ్ పర్సంటేజ్ వివరాలు, పోలింగ్ జరుగుతున్న తీరుపై జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలో ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట్, అరకు నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, డిఆర్ఓ పద్మావతి, ఎస్‌సిలు వివిఎస్.శర్మ, పి.అంబేద్కర్, అరకు నియోజక వర్గం సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

రాజీనామా పత్రాలను అందజేస్తున్న గ్రామ వాలంటీర్లు

గ్రామ వాలంటీర్లు మూకుమ్మడి రాజీనామా

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని యు.చీడిపాలెం సచివాలయ పరిధిలోని 13 మంది గ్రామ వాలంటీర్లందరూ మంగళవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో 58 నెలల నుంచి ఎంతో శ్రమించి ప్రజలకు పెన్షన్లు, సంక్షేమ పథకాలు అందించామని వారు తెలిపారు. ప్రస్తుతం ప్రతి పక్షాలు తప్పుడు ప్రచారాలు చేసి, తమను ప్రజలకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పెన్షన్ల పంపిణీలో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు చూసి మనస్తాపానికి గురై రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న అప్పలనర్స

జిఒ 3పై విచారణకు

పూర్తిస్థాయి జడ్జిని నియమించాలి

- ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ సభ్యులు అప్పలనర్స డిమాండ్

ప్రజాశక్తి -పాడేరు: స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగాలల్లో నూరు శాతం రిజర్వేషన్ కల్పించే జీవో 3పై ఆదివాసీ గిరిజన సంఘం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ విచారణకు పూర్తి స్థాయి న్యాయమూర్తుల సభ్యులను నియమించాలని సుప్రీంకోర్టును ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ్ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సుప్రీంకోర్టు జీవో 3 ని రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పు ను ఆదివాసీ గిరిజన సంఘం సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ ను 2020 జూన్ 30న దాఖలు చేసినట్లు చెప్పారు. పిటిషన్ ను స్వీకరించిన కోర్టు ఐదు మందితో కూడిన జడ్జిలతో కూడిన బెంచ్‌కు సిపార్స్ చేసిందన్నారు. గిరిజన సంఘంతో పాటు సుమారు 17 పిటిషన్ సుప్రీంకోర్టులో దాఖలు అయ్యాయని, ఇప్పటికే రెండుసార్లు విచారణకు వచ్చిందని, పూర్తిస్థాయి జడ్జిలు లేరని, దీంతో సుప్రీంకోర్టు విచారణ నిర్వహించకుండా వాయిదాలు వేస్తోందన్నారు. బుధవారం విచారణకు వస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయి జడ్జీలను నియమించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. జీవో 3 ను రద్దు చేసి నేటికీ మూడున్నర ఏళ్లు అవుతున్నా పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును పున: సమీక్షించి ఆదివాసులకు నూరు శాతం రిజర్వేషన్ హక్కుని కల్పించాలని పెద్ద ఎత్తున పోరాటం చేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని ఆదివాసీల పట్ల వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మాన పడల్, జిల్లా కమిటీ సభ్యులు కోటి బాబు, సంకయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికలను బహిష్కరించండి'

ప్రజాశక్తి -జిమాడుగుల: ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ పేరిట మంగళవారం స్థానిక విలేకరులకు లేఖను విడుదల చేశారు. ఆ లేఖలో ఈ విధంగా పేర్కొన్నారు. రాజకీయ నాయకులు పార్టీ ఫిరాయింపులు, అవకాశవాద కూటములకు పూనుకుంటున్నారు. ధనబలం, కండబలం, మద్యం, హింస, బెదిరింపులతో ఎన్నికల ప్రహసనానికి సిద్ధమవుతున్నారు. ప్రజలను మరోసారి మోసం చేయడానికి అనేక, హామీలు, వాగ్దానాలతో ఎన్నికల పార్టీలన్నీ జోరుగా ప్రచారాన్ని చేస్తున్నాయి. అధికారం లోకి వచ్చిన మరుక్షణమే ప్రజల సంపదను దోచుకుంటున్నాయన్నారు. వైసిపి జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని చెప్పి విస్మరించింది. . జీవో 3 రద్దు విషయంలో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తినప్పటికీ నోరు మెదప లేదని ఆ లేఖలో మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ పేర్కొన్నారు.

మండుతున్న ఎండలు

- సీలేరులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- అధిక వేడితో జనం బెంబేలు

జనం లేక నిర్మానుషంగా ఉన్న సీలేరు మార్కెట్ రోడ్డు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో వారం రోజుల నుంచి ఎండలు భగభగ మండుతున్నాయి. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి సూర్యుడు కాంతివంతమైన కిరణాలతో ప్రకాశిస్తున్నాడు. మధ్యాహ్న సమయానికి ఎండ తీవ్రత పెరిగి వడగాల్పులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మునుపెన్నడు లేని విధంగా మార్చి, ఏప్రిల్ నెలల్లోనే ఎండలు మండుతుండడంతో రానున్న రోజుల్లో మరింత ఎండ తీవ్రత ఉంటుందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

సీలేరులో మంగళవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఉదయం 11.20 గంటలకు 35 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కాగా, అది పెరుగుతూ మధ్యాహ్న 2.30 గంటలకు 39 డిగ్రీలకు చేరుకుంది. దీంతో రోడ్లపై జనం సంచరించడానికి సాహసించలేదు. ప్రతి ఒక్కరూ ఇళ్లకే పరిమితమయ్యారు. ఏసీలు, కూలర్లు వేసుకొని అధిక ఉష్ణోగ్రత నుంచి ఉపశమనం పొందారు. మరి కొంతమంది చెట్లు నీడన సేద తీరుతున్నారు. సాయంత్రం 4.30 గంటలైనా ఎండ తీవ్రత తగ్గలేదు. దీంతో వ్యాపారులు సైతం సాయంత్రం వరకు దుకాణాలు తెరవడానికి సాహించలేదు.

సీలేరు నది పరివాహక ప్రాంతంలో ఉన్న చింతపల్లి క్యాంపు గ్రామాల గిరిజనులు సమీప అటవీ ప్రాంతంలోని పచ్చని చెట్లు కింద సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు. మూగజీవాల సైతం ఎండకు తాళలేక దట్టమైన అటవీ ప్రాంతంలో సేద తీరుతున్నాయి. ఎండతో పాటు వడగాల్పులు వీస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఎండ తీవ్రతకు నాన అవస్థలు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు ఇలాగే ఉంటే వృద్ధులు, చిన్నపిల్లలకు ఇబ్బందులు తప్పవు. మరో రెండు మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ చెబుతుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

ఎండ వేడికి ఇళ్లకే ప్రజలు పరిమితం

విఆర్.పురం : రోజురోజుకు ఎండలు మండుతున్నాయి. ఎండ దాటికి తట్టుకోలేక జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో పాటు వేడిగాలులు విపరీతంగా ఉండటంతో అత్యాసరమైతే తప్ప జనం బయటికి రావడం లేదు. దీంతో రోడ్లన్నీ నిర్మానుషంగా దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలో ఎండ వేడికి జనం బయటకు రాక వివిధ దుకాణాలు, హోటళ్లు బోసి పోతున్నాయి. కూలీలు ఎండకు తట్టుకోలేక 11 గంటలకే ఇళ్ళ బాట పడుతున్నారు. ఇళ్ళల్లో ఉన్న జనం చెట్ల వద్దకు వెళ్ళి ఉపశమనం పొందుతున్నారు. ఇప్పుడే ఇంత ఎండలు ఉంటే రానున్న మే నెలలో మరింత అధికంగా ఉండే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు. ఎండ వేడిని తట్టుకునేందుకు జనం తగు జాగ్రత్తలు వహించాలని వైద్యులు తెలుపుతున్నారు.

విఆర్.పురంలో బోసిపోయిన ఉన్న రహదారి

అవగాహన కల్పిస్తున్న రాజవొమ్మంగి తహశీల్దారు సత్యనారాయణ

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలో లబ్బర్తి, కింద్ర, లాగరాయి, తాళ్లపాలెం, అనంతగిరి గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు సత్యనారాయణ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఓటర్లు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. మండలంలో మొత్తం ఓటర్లు 31,638 మంది కాగా మహిళలు 16,269, పురుషులు 15,369 మంది ఉన్నారని తెలిపారు. ఓటు హక్కు వినియోగించు కునేందుకు 52 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకొనేలా చైతన్యం

విఆర్.పురం : ఓటు హక్కును అందరూ వినియోగించుకొనేలా చైతన్య పర్చాలని తహశీల్దారు మౌలానా పాజిల్‌ఆదేశించారు. మండల కేంద్రం రేఖపల్లిలోని తహశీల్దారు కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. అలాగే విఆర్.పురం బీసీ కాలనీలో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూటు అధికారులు, బిఎల్వోలు, సెక్టోరియల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు శ్రీగోపిక ఎంపిక

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలం కొండపల్లి గ్రామానికి చెందిన బీరబోయిన సునంద శ్రీగోపిక నవోదయ విద్యాలయం ప్రవేశానికి అర్హత సాధించింది. చెరువు కొమ్ముపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సునంద శ్రీగోపిక 5వ తరగతి చదువుతుండగా, ఆమె తండ్రి మురళీకృష్ణ అదే పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. నవోదయకు ఎంపికైన సునంద శ్రీగోపికకు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు

ప్రజాశక్తి- మోతుగూడెం

సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని, అసాంఘిక శక్తులకు సహకరించవద్దని అల్లూరి సీతారామరాజు జిల్లా, వై.రామవరం మండలం, డొంకరాయి ఎస్ఐ శివకుమార్ గిరిజనులకు హితవుపలికారు. వై.రామవరం మండలం బొడ్డగండి గ్రామ పంచాయితీలోని పులికొండ గ్రామంలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శివ కుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకావాలన్నారు. యువత గంజాయి, సారా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా వుండాలని సూచించారు. యువత కష్టపడి పనిచేయాలని, బాగా చదువుకొని ప్రయోజకులై తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం పులికొండ యువకులకు వాలీబాల్ కిట్ అందించారు. తరువాత బొడ్డగండి, నాగలోవ, కల్లెపుగొంది గ్రామాల యువకులతో పోలీస్ స్టేషన్లో సమావేశం నిర్వహించి, గ్రామాల్లో పరిస్థితులు తెలుసుకున్నారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బొడ్డగండి పైన ఉన్న 12 గ్రామాల ప్రజలకు తెలియచేయాలని సూచించారు. ఏదైనా అవసరం ఉంటే పోలీసులను ఆశ్రయించాలన్నారు. అనంతరం బొడ్డగండి, నాగలోవ, కల్లెపుగొంది గ్రామాల యువకులకు వాలీబాల్ కిట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో రైటర్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ పోసయ్య , కన్నప్ప రెడ్డి, గంగరాజు పాల్గొన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న డొంకరాయి ఎస్ఐ శివకుమార్

లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పింఛన్లు

- జిల్లా కలెక్టర్ విజయ సునీత

మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

ప్రజాశక్తి-పాడేరు: ఫించన్ల పంపిణీలో లబ్దిదారులకు ఎటువంటి అసౌకర్యమూ కలుగకుండా పంపిణీ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి డిఆర్డిఎ పిడితో కలిసి ఎంపిడిఓలతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల మూడవ తేదీన ఉదయం బ్యాంకుల నుండి ఫించన్ డబ్బులను డ్రా చేసి మధ్యాహ్నం నుండి పంపిణీ ప్రారంభించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్‌లో ఎంపిడిఓలకు దిశానిర్దేశం చేసారు. ఆయా మండలాలలోని గ్రామాల పరిస్థితిని బట్టి ఇంటింటికి వెళ్లి పంచడం, లేదా ఆయా గ్రామాలలో సచివాలయాలు మినహా ఇతర ప్రభుత్వ భవనాల వద్ద లేదా లబ్దిదారులను సచివాలయాలకు రప్పించి ఫించన్ పంపిణీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేసారు. ఫించను శత శాతం పంపిణీ పూర్తి అయినంత వరకు సచివాలయాల సిబ్బంది ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. పలువురు ఎంపిడిఓలు ఇంటిఇంటికి పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా కలెక్టర్ స్పందిస్తూ, ఆథరైజేషన్ ఉన్న వారి ద్వారా మాత్రమే పంపిణీ జరగాలని స్పష్టం చేసారు. రానున్న మూడు నాలుగు రోజులలో ఫించన్ల పంపిణీ పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎంపిడిఒకు వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: వృద్ధులకు, వితంతువులకు, వికాలాంగులకు ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయాలని టిడిపి నాయకులు స్థానిక ఎంపీడీవో జయఉమకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పింఛన్లు ఇంటి వద్దకే పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు కమ్మిడి సుబ్బారావు, టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, మాజీ ఎంపీపీ దన్నెరావు, మాజీ సర్పంచి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి :వృద్ధులు, వికలాంగులకు, ఇతర పింఛను లబ్ధిదారులకు ఇళ్ల వద్దకెళ్లి పింఛన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు వాలంటీర్లకు బదులుగా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మంగళవారం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నగదు పంపిణీ కార్యక్రమం నుండి వాలంటీర్ వ్యవస్థను తప్పిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు గత ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్, సిమ్ కార్డులను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు. పింఛన్లను సచివాలయం సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇంటికే నగదు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, గురుకు శేష కుమార్, మళ్ళా దుర్గా ప్రసాద్, రేవుల రామకృష్ణారెడ్డి, భీశెట్టి అప్పాజీ, పొడియం శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులు, చట్టాలను రక్షించే...

సిపిఎం ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సురేంద్ర, జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు

మాట్లాడుతున్న సురేంద్ర, గంగరాజు, బాలదేవ్

ప్రజాశక్తి-అరకులోయరూరల్:ఆదివాసీ హక్కులు, చట్టాలు రక్షించే సిపిఎం అరకు పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సురేంద్ర, జిల్లా నాయకులు పి.బాలదేవ్, అనంతగిరి జెడ్పిటిసి డి.గంగరాజు కోరారు. అరకువేలి మండలం తురాయిగూడ, కరాయిగూడ దేవస్థానం ఆవరణంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ, ఆదివాసీల సమగ్ర అభివృద్ధి కోసం పని చేసే సిపిఎం అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. చినలబుడు పంచాయతీలో అత్యధిక మంది వ్యవసాయ రైతులు ఉన్నారని, కాయగూరలు, పప్పు దినుసుల పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం చేయాలని, పంటలకు మార్కెట్ సదుపాయం కల్పించి ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 9 చెక్ డ్యామ్‌లు తక్షణమే మరమ్మతు చేసి సుమారు 600 ఎకరాలకు సాగునీరు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కె.మొద్దు, నాయకులు లోక్కోయి సహదేవ్, గాసి, రత్నకుమారి, ముకుంద్ పాల్గొన్నారు.

అనంతగిరి: బీజేపీకి కొమ్ము కాస్తున్న పార్టీలను ఓడించి సీపీఎం బలపర్చిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం మండల కార్యదర్శి సోమెల నాగులు కోరారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ ఫలంవలస గ్రామంలో సీపీఎం బూత్ స్థాయి సమావేశం మామిడి క్రిష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నాగులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిన బీజేపీకి మద్దతు ఇచ్చిన టిడిపి, జనసేన పరోక్షంగా మద్దతు ఇస్తున్న వైసీపీ పార్టీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. గిరిజన ప్రజల కోసం పోరాటం చేస్తున్న సీపీఎం అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సిపిఎంతోనే మన భూములకు రక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టోకూరు సీపీఎం సర్పంచ్ కిల్లో మోస్య, నాయకులు కాకర సింగులు, జర్రా రాము, సన్యాసి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి గీతను ఓడించండి

పెదబయలు: మండలంలోని సీతగుంట, లక్ష్మిపేట బొండాపల్లిలో సిపిఎం సీనియర్ నాయకులు కీల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్పీటీసీ సభ్యులు గంగరాజు, నాయకులు బొండా సన్నిబాబు జే.సునీల్ పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేతలు సురేంద్ర, గంగరాజు మాట్లాడుతూ,మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఆదివాసీ ప్రాంతంలో విస్తారమైన ఖనిజ సంపదను దోచుకుని ఎన్నికల బరిలో మళ్లీ నిలుస్తున్నారన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు బిజెపి ఆలోచన చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు పనులపై దర్యాప్తు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

నినాదాలు చేస్తున్న నేతలు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని గుమ్మ పంచాయతీ కొండ శిఖర గ్రామాలైన నిమ్మఊట, కడరేవు, కర్రిగోడ గ్రామాల్లో చేపట్టిన రోడ్డు పనుల్లో అక్రమాలపై ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని సీపీఎం ఉమ్మడి జిల్లా కార్యధర్శి వర్గ సభ్యులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో కర్రిగోడ గ్రామస్తులు ధర్నా నిర్వహించారు, అనంతరం సీపీఎం నేత గోవిందరావు మాట్లాడుతూ, కర్రిగూడకు 3 కిలోమీటర్లకు. గాను రూ.80. లక్షలు, కర్రిగూడ నుండి కడరేవు గ్రామానికి 0.80 కి.మీ. గాను రూ.22.0 లక్షలు గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులకు మంజూరు అయ్యాయయన్నారు.మట్టి పరమెషన్ పనులు మాత్రమే చేసి గత సంవత్సరం మార్చి లో రెండు చోట్లా రోడ్డు పనుల్లో 65.5 లక్షలు బిల్లులు అప్లోడ్ చేసి జూన్ లో పేమెంట్ తీసుకొని స్వాహకు పాల్పడ్డారన్నారు. నేటికీ 10 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ రోడ్డు పనులు ప్రారంభం కాలేదన్నారు. నిమ్మ ఊట నుండి సుమారు 2 కిలోమీటర్లు మాత్రమే పనులు చేసి చేతులు దులుపుకొన్నారని తెలిపారు. దీనిపై గతంలో మండల పరిషత్ సమవేశం,. సోషల్ ఆడిట్ పబ్లిక్ ఫోరంలో ప్రస్థావనకు వచ్చినా ఇంజనీరింగ్ అధికారులు మోసపూరిత ప్రకటనలతో దాటవేశారని విమర్శించారు.సోషల్ ఆడిట్‌లో లక్షల్లో రికవరీకి ప్రతిపాదించినా నేటికీ చేయలేదన్నారు.దీనిపై సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు ఆందోళనకు సంబంధిత శాఖ అధికారులు మంగళవారం గ్రామంలో సందర్శించి తూతూమంత్రంగా విచారణ చేపట్టారన్నారు. ఉన్నతాధికారులతో సమగ్ర దర్యాప్తు నిర్వహించి రోడ్డు పనులు పూర్తి చేపట్టే విదంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎ.రాజారావు, బి.దేముడు, రామన్న పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నిందితునితో పోలీసులు

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-హుకుంపేట:హుకుంపేట జంక్షన్ వద్ద వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిల్స్ సీజ్ చేసి, తరలిస్తున్న శోభ రాంబాబును అదుపులోకి తీసుకున్నామని సిఐ సన్యాసినాయుడు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం బాటిలు రవాణా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో మద్యం తరలించినప్పుడు గ్రామస్తులు సమాచారం ఇవ్వాలని కోరారు.గ్రామాల్లో అవాంఛనీయ సంఘ టనలు చోటు చేసుకోకుండా గ్రామ ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతినమల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైనట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. వాంబే కాలనీకి చెందిన ఎస్.శ్యామల సోమవారం ఉదయం ఆసుపత్రికి వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. మిదిలాపూర్ ఉడా కాలనీ 100 ఫీట్ రోడ్డు వద్ద సోమవారం రాత్రి డ్రెయినేజీ కెనాల్ ఎదురుగా 40 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని పురుషుని మృతదేహం ఉందని సిఐ వివరించారు. మృతుడు బ్లాక్, బ్లూ కలర్ నెక్ టి షర్ట్ డార్క్ బ్లూ లోయర్‌తో ఉన్నాడని, కొన్ని ట్యాబ్లెట్ స్ట్రిప్స్, జేబులో ఒక చిన్న వాటర్ బాటిల్ ఉన్నాయని తెలిపారు. సంబంధిత బంధువులు ఉంటే పిఎం పాలెం పోలీసులను సంప్రదించాలని సిఐ కోరారు. మృతదేహాన్ని కెజిహెచ్ శవాగారంలో భద్రపరిచినట్లు తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గిడిజాల పంచాయతీ వేమగోట్టిపాలెం గ్రామానికి చెందిన సుంకరి బాలకృష్ణ (39) గుండెపోటుతో మంగళవారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం... బాలకృష్ణ ఉపాధి హామీ పనులకు సంబంధించిన చెరువు పనికి మంగళవారం బయలుదేరుతున్న సమయంలో ఉదయం 7:30 సమయంలో ఛాతిలో నొప్పి వచ్చింది. దీంతో కుటుంబీకులు వెంటనే ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో దుక్కవానిపాలెం టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య లక్ష్మి కూలి పనులు చేస్తోంది. కుమార్తె, కుమారుడు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. బాలకృష్ణ మృతి చెందడంతో నిరుపేదలైన ఆ కుటుంబ సభ్యులు ఆధారం కోల్పోయారని, అధికారులు స్పందించి ఆ కుటుంబానికి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తనిఖీలు చేపడుతున్న పోలీసులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - విఆర్.పురం : వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని వరరామచంద్రాపురం ఎస్సై కె. నాగరాజు హెచ్చరించారు. మండల కేంద్రంలోని రాజపేట మూడురోడ్ల సర్కిల్లో మంగళవారం పోలీసులు వాహన తాఖీలు నిర్వహించారు. వాహన కాగితాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, బండి ఇన్సూరెన్స్, బండి వివరాలు కలిగి ఉండాలని సూచించారు. టూ వీలర్‌పై ముగ్గురు వ్యక్తులు కలిగి ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నగదు రూపేణా వాహనాల్లో డబ్బు కలిగిఉన్నా వాటికి సంబంధించి వివరాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై రాధాకృష్ణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వాసు

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం : సికిల్ సెల్ ఎనీమియాపై స్థానిక ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ నారే వాసు పిల్లలకు హెల్త్ విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వాసు మాట్లాడుతూ రంపచోడవరం చుట్టూ పక్కల ప్రాంతంలో చాలా మంది పిల్లలు రక్తహీనాత, కాళ్ళు వాపులు, నీరసం, కామెర్లు, ఇతర వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. వాళ్లందరూ మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని, వారు ఏరియా ఆసుపత్రి సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

స్పోర్ట్స్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ వాల్తేరు డివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుండి మే 9 వరకూ జరిగే మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. డిఆర్ఎం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ వాల్తేరు డివిజన్ ప్రెసిడెంట్ సౌరభ్ ప్రసాద్, ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భాటి పాల్గొన్నారు.

త్వరలో టిడిపిలో చేరుతా : సీతంరాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో టిడిపి, బిజెపి, జనసేన కూటమి అభ్యర్థి గెలుపునకు గట్టిగా కృషి చేస్తానని, తెలుగుదేశం పార్టీ నుండి ఆహ్వానం ఉందని, త్వరలోనే ఆ పార్టీలో చేరుతానని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ తెలిపారు. తనకు వైసిపిలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మద్దతు ఇస్తూ ఆయన గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

క్రికెటర్ల పౌష్టికాహారం కోసం రూ.1.50 కోట్లు

దేశంలోనే మొట్టమొదటి సారిగా అమలు

చెక్కును అందజేసిన సౌరభ్ గంగూలీ, రికీ పాంటింగ్, గోపీనాథ్‌రెడ్డి



క్రీడాకారులకు చెక్కు అందజేస్తున్న గంగూలీ, రికీపాంటింగ్, గోపీనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - పిఎం.పాలెం : పౌష్టికాహార లేమితో ఉన్న జోనల్ స్థాయి 400 మంది క్రికెటర్లకు పౌష్టికాహార నిమిత్తం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రూ. 1.50 కోట్ల సాయం అందజేసింది. ఈ మేరకు నగరంలోని పిఎం.పాలెంలో ఉన్న స్టేడియంలో మంగళవారం ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి, బిసిసిఐ మాజీ ప్రెసిడెంట్, భారత మాజీ కెప్టెన్, ఢిల్లీ క్యాపిటల్స్ డైరెక్టర్ సౌరభ్ గంగూలీ, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్, ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ చేతుల మీదుగా రూ.1.50 కోట్ల విలువ చేసే చెక్కును క్రికెటర్లకు అందజేశారు. అనంతరం గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ యువ క్రికెటర్లు పౌష్టికాహార లేమితో బాధ పడకూడదనే ఉద్దేశంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పి.శరత్ చంద్రారెడ్డి నాయకత్వంలో ప్రణాళికను అమలు చేసినట్లు తెలిపారు. అకాడమీలు, కోచింగ్ క్యాంప్‌లలో శిక్షణ తీసుకున్న వారి పౌష్టికాహారం కోసం నెలకు రూ.3 వేల చొప్పున 400 మంది క్రికెటర్లకు ఏటా రూ.1.50 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎసిఎ పరిధిలో ఉన్న అకాడమీలు, సబ్ సెంటర్లలో కల్పించిన మౌలిక సదుపాయాల వల్ల మంచి ఫలితాలు వచ్చాయన్నారు. సౌరబ్ గంగూలీ, రికీ పాంటింగ్ మాట్లాడుతూ యువ క్రికెటర్ల పౌష్టికాహారం కోసం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఈ పథకాన్ని అమలు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎసిఎ జాయింట్ సెక్రటరీ రాకేష్, సిఇఒ డాక్టర్ ఎంవి.శివారెడ్డి, జనరల్ మేనేజర్లు ఎంఎస్.కుమార్, ఎస్ఎంఎన్.రోహిత్ పాల్గొన్నారు.

39వ వార్డులో వాసుపల్లి ప్రచారం

ప్రచారం నిర్వహిస్తున్న వాసుపల్లి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 39వ వార్డులో వైసిపి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మంగళవారం ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ఓటర్లను పలకరించారు. స్టెప్పులు వేసి వారిని ఆప్యాయంగా కౌగిలించుకున్నారు. తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 39వ వార్డు పార్టీ అధ్యక్షురాలు, శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం, మైనార్టీ సెల్ అధ్యక్షులు ముజీబ్ ఖాన్, సబీరా బేగం, సనపల రవీంద్ర, సలీం పాల్గొన్నారు. అలాగే ఆశీలుమెట్టలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబుకు అవ్వాతాతల ఉసురు తగలక తప్పదని అన్నారు. ఆయన తీరు వల్లే పెన్షన్లు సకాలంలో అందలేదన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, కార్పొరేటర్లు కోడూరు అప్పల రత్నం, మేరీ జోన్స్, చెన్నా జానకిరామ్, జెసిఎస్ మండల అధ్యక్షుడు దొడ్డి రామానంద్, సత్యనారాయణ ఆయన వెంట ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలను మ్యానిఫెస్టోలో చేర్చండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను టిడిపి ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చి భరోసా కల్పించాలని జర్నలిస్టు సంఘాల నేతలు కోరారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం విశాఖ లోక్‌సభ టిడిపి అభ్యర్థి ఎం.శ్రీ భరత్, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీలకు ఈ మేరకు వినతి పత్రాలు అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను వారితో చర్చించారు. కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎంఎ) అధ్యక్షులు పి.సత్యనారాయణ, ఎపియూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రమోహన్, అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి కమల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అగ్ని ప్రమాద సమయంలో జాగ్రత్తలపై శిక్షణ

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏరియా ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను ఎలా అప్రమత్తం చేయాలి, వారిని బయటికి ఏ విధంగా తరలించాలనే విషయాలపై అగ్ని మాపక సిబ్బంది మంగళవారం ప్రయోగాత్మకంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎంఓ ఇంద్ర, గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బందికి హాస్పిటల్‌లో ఫైర్ ఎక్విప్మెంట్ గురించి, ఫైర్ అలారం, ఫైర్ ఎగ్జిట్ బోర్డ్స్ గురించి తెలియజేశారు. వాటిని ఏ విధంగా ఉపయోగించాలో చెప్పారు. గ్యాస్ ఫైర్ జరిగిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఈ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ లక్ష్మి, ఎస్ఎఫ్ఓ గంగన్నదొర, ఎల్ఎఫ్ బి.రామచంద్రరావు, ఎఫ్ నాగేశ్వరరావు, ఎఫ్ఎం శంకర్రావు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బోరుబావి చుట్టూ అపారిశుధ్యం తొలగింపు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -విఆర్.పురం : మండలంలోని విఆర్ పురం గ్రామంలో రాజీవ్‌గాంధీ సెంటర్ వద్ద ఉన్న తాగునీటి బోరుబావి చుట్టూ ఉన్న చెత్తను పంచాయతీ అధికారులు తొలగించారు. రాజీవ్‌గాంధీ సెంటర్‌లో ఉన్న బోరుబావి ఆవరణలోనూ, చుట్టూ పెద్ద మొత్తంలో చెత్త పేరుకుపోయిన బోరుబావిని ఉపయోగించడానికి వీల్లేకుండా ఉండడంతో 'తాగునీటి బోరు చుట్టూ అపారిశుధ్యం' శీర్షికన మార్చి 28న గురువారం ప్రజాశక్తి వార్త ప్రచురించింది. ఈ వార్తకు అధికారులు స్పందించి బోరు చుట్టూ ఉన్న చెత్తాచెదారం తొలగించి, బోరును ప్రజలకు ఉపయోగపడేలాగా శుభ్రం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రజాశక్తికి, అపారిశుధ్యం తొలగింపునకు చర్యలు తీసుకున్న ఒడ్డుగూడెం పంచాయతీ సెక్రెటరీ స్వరూపారెడ్డికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

పింఛన్ల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి - కొయ్యూరు : పింఛన్ల సక్రమంగా పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కొయ్యూరు ఎంపిడిఒ లాలం సీతయ్య అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సామాజిక పింఛన్ల పంపిణీలో గ్రామ వాలంటీర్లను దూరంగా ఉంచినట్టు తెలిపారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో పలు సమావేశాలు నిర్వహించి, పింఛన్ల పంపిణీకి సంబంధించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశామని చెప్పారు.

17వ వార్డులో కొనసాగిన ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి పాలనలో ప్రజా సంక్షేమాన్ని అమలు జరిపామని విశాఖ ఎంపీ, ప్రస్తుత తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం జివిఎంసి 17వ వార్డు ఎంవిపి.కాలనీ సెక్టార్-4, వెంకోజీపాలెంలో ఆయన పాదయాత్ర కొనసాగించారు. వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, నాగరాజు, పార్టీ నాయకులు ఆయన వెంట నడిచారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవికాలం దృష్ట్యా, మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో తలెత్తే తాగునీటి సమస్యల పరిష్కారం కోసం టిఎస్ఆర్ కాంప్లెక్స్ నీటి సరఫరా విభాగంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసినట్టు జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. నగర వాసులు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.